సెల్‌ఫోన్ల రికవరీలో ఫస్ట్

■ ఎస్పీ సింధుశర్మ ■ 450 ఫోన్లు రికవరీ

బాధితులకు పోగొట్టుకున్న సెల్ ఫోన్లను అందజేస్తున్న పోలీసులు

కామారెడ్డి, జూలై 17 : గతంలో చాలా మంది తమ సెల్‌ఫోన్ పోగొట్టుకునేవారు. విలువైన సెల్‌ఫోన్లను కొనాలంటేనే ఆర్థికంగా ఇబ్బంది పడేవారు. కానీ.. ఇప్పుడు సెల్‌ఫోన్ పోయినా కూడా సీఈఐఆర్ అనే పోర్టల్ ద్వారా పోటగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసి పోలీసులు అప్పగిస్తున్నారు. ఇలా పోగొట్టుకున్న సెల్‌ఫోన్ రికవరీలో రాష్ట్రంలోనే కామారెడ్డి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లాలో సెల్‌ఫోన్ రికవరీలో బాన్సువాడ పోలీసు స్టేషన్ మొదటి స్థానంలో ఉంది. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటి రిజిస్టర్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తే పోయిన సెల్‌ఫోన్ తిరిగి పొందే అవకాశం ఉంది. పోగొట్టుకున్న సెల్‌ఫోన్ రికవరీ చేయడానికి సీఈఐఆర్ పోర్టల్ ఎంతగానో ఉపయోగపడుతున్నది.

సీఈఐఆర్ ద్వారా 450 ఫోన్ల రికవరీ..

సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా జిల్లాలో సుమారు ఈ ఏడాది మొదటి నుంచి జూన్ నెల వరకు 450 ఫోన్లు రికవరీ చేశారు. సీఈఐఆర్ ఆధునిక సాంకేతిక వినియోగం ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించడం గతంలో కంటే సులభతరం అవడమే కాకుండా మంచి ఫలితాలను అందిస్తున్నది. సీఈఐఆర్ ద్వారా వ్యక్తిగత సమాచార భద్రత కూడా కలుగుతుంది. వివరాలు నమోదు చేసి లాక్ చేయవచ్చు. దొరికిన తర్వాత అన్‌లాక్ చేసుకునే సౌలభ్యం కూడా ఉన్నది. గత సంవత్సరం ఏప్రిల్ నెలలో సీఈఐఆర్ విధానాన్ని వాడుకలోకి తీసుకువచ్చారు. ఈ విధానాన్ని ఉపయోగించి ఆరునెలల్లో పోగొట్టుకున్న 450 మంది మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు పోలీసులు అప్పగించారు. ఫోన్ ఐఎంఈఐ నంబర్‌తో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా బ్లాక్ చేయవచ్చు. మొబైల్ ఫోన్ దొరికిన వ్యక్తి ఫోన్‌లో సిమ్ కార్డు వేస్తే ఆ సిమ్ కార్డు వివరాలు మనకు సీఈఐఆర్ ట్రాన్స్‌బిలిటి రిపోర్ట్‌లో వస్తాయి.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి

మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నవారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలి. సెల్‌ఫోన్ల రికవరీలో కామారెడ్డి జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉంది. జూన్ వరకు 450 సెల్ ఫోన్లు రికవరీ చేశాం. ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకుంటే ముందుగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి దరఖాస్తు ఇస్తే రిసిప్ట్ ఇస్తారు. ఈ రిసిప్ట్ ద్వారా కోల్పోయిన ఫోన్ ఐఎంఈఐ నంబర్‌తో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను బ్లాక్ చేయవచ్చు.

- సింధూశర్మ, ఎస్పీ, కామారెడ్డి జిల్లా

భయపెడుతున్న కుక్కల గుంపులు

■ ఆందోళన చెందుతున్న విద్యార్థులు, గ్రామస్తులు
■ చోద్యం చూస్తున్న అధికారులు
■ రోడ్డుపైకి రావాలంటేనే జంకుతున్న జనం

గోపాల్‌పేటలో ఎస్సీ వసతిగృహం ఎదుట రోడ్డుపై కుక్కల గుంపు

ఆదర్శ పాఠశాల విద్యార్థినులు బస్సు కోసం వేచిఉన్న సమయంలో వారిపైకి వెళ్తున్న కుక్కలు

నాగిరెడ్డిపేట, జూలై 17: మండల కేంద్రం గోపాల్‌పేటలో కుక్కుల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వారిపై అకస్మాత్తుగా దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఇటీవల రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఒక వృద్ధుడితోపాటు ముగ్గురు చిన్నారులను తీవ్రంగా గాయపరిచాయి. బస్టాండ్, పాఠశాల వద్ద కుక్కలు దాడులు చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. దీంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. బస్సు కోసం ఎదురుచూస్తున్న ఓ మహిళను సైతం కరిచాయి. కుక్కను తరిమేందుకు వెళ్లిన వారిపైకి కూడా రావడంతో వారు భయపడి పరుగుతీశారు. మాంసం విక్రయదారులు పారవేస్తున్న వ్యర్థాలను తినడంతో కుక్కలు మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. పాఠశాల సమయంలో రోడ్డుపైనే కుక్కలు ఉండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయపడుతున్నారు. విద్యార్థులను తల్లిదండ్రులు పాఠశాల వద్దకు తీసుకువచ్చి, స్కూల్ ముగిసిన అనంతరం తీసుకెళ్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా మనుషులు కనిపిస్తే.. గట్టిగా మొరుగుతూ.. దాడి చేసి గాయపరుస్తున్నాయి. అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పెద్దమల్లారెడ్డిలో ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

దోమకొండ/భిక్కనూరు,, జూలై 17: దోమకొండ మండలం కేంద్రంతోపాటు మండలంలోని అంచనూర్, సీతారాంపూర్ గ్రామాల్లో బుధవారం కేంద్ర జలశక్తి అభియాన్ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా ఫార్మ్ పాండ్, ఫిష్ పాండ్, మీ ట్యాంక్, హార్టికల్చర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటి వినియోగం, నల్లాల వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేంద్ర జల శక్తి అభియాన్ అధికారులు కరుణాకరన్, శ్రీకిష్ణ పవార్, ఏపీడీ వామనరావు, ఎఫ్ఎం రాంనారాయణ, డీఆర్‌పీ హరికృష్ణ, మండల అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామాన్ని కేంద్ర నోడల్ బృందం సభ్యులు కరుణాకర్, శ్రీకృష్ణ పవార్ బుధవారం సందర్శించారు. ఏపీవో రాధిక, పంచాయతీ కార్యదర్శి, లక్ష్మి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ అచ్యుతమ్ సేవలు అభినందనీయం

అచ్యుతమ్‌ను సన్మానిస్తున్న మెడికల్ అసోసియేషన్ సభ్యులు

బాన్సువాడ(పిట్లం), జూలై 17 : పిట్లం మండలంలోని చుట్టుపక్కల గ్రామాల రోగులకు డాక్టర్ అచ్యుతమ్ అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమని మెడికల్ అసోసియేషన్ సభ్యులు కొనియాడారు. 40 ఏండ్లుగా రోగులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ అచ్యుతమ్ వయస్సు 88 ఏండ్లు అయినప్పటికీ ఇప్పటికీ వైద్య సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నాడని తెలిపారు. ఆయనను పిట్లం మెడికల్ అసోసియేషన్ సభ్యులు బుధవారం శాలువాతో సత్కరించారు.

పెట్రోల్ బంక్ ప్రారంభం

భిక్కనూరు, జూలై 17 : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వెనుక కొత్తగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పరి రమేశ్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కారును ఢీకొని లారీ బోల్తా

భిక్కనూరు, జూలై 17 : భిక్కనూరు టోల్ ప్లాజా సమీపంలో కారును ఢీకొనడంతో లారీ బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారిపై భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద బుధవారం ఆదిలాబాద్‌కు చెందిన న్యాయవాది హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో టోల్ ప్లాజా వద్ద వెదురు బొంగుల లోడ్‌తో వెళ్తున్న లారీ కారును ఢీకొట్టింది. దీంతో భయపడిన లారీ డ్రైవర్ నడుస్తున్న లారీలో నుంచి కిందికి దూకేశాడు. దీంతో లారీ కొంచెం ముందుకు వెళ్లి హైవే పక్కన బోల్తా పడింది. టోల్ ప్లాజా సిబ్బంది ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా రోడ్డుపైన ఉన్న కారును పక్కకు తీసినట్లు స్థానికులు తెలిపారు.

హైకోర్టు ప్లీడర్‌గా గొట్టిముక్కుల వాసి

దోమకొండ, జూలై 17: మండలంలోని గొట్టిముక్కుల గ్రామానికి చెందిన శ్రావణ్‌కుమార్ గౌడ్‌ను రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ప్లీడర్‌గా నియమించింది. తెలంగాణ వ్యాప్తంగా 19 మంది అడ్వకేట్లను హైకోర్టులో ప్రభుత్వ కేసులను వాదించేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం వీరిని నియమించినట్లు తెలిపారు. న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి పేరిట జీవో నం 399ను జారీ చేసినట్లు తెలిపారు. మండలంలో గొట్టిముక్కుల గ్రామానికి చెందిన శ్రావణ్‌కుమార్ గౌడ్ 10వ తరగతి వరకు కామారెడ్డిలో అభ్యసించి ఉన్నత చదువులను హైదరాబాద్‌లో పూర్తి చేశారు. లా పూర్తి చేసి హైదరాబాద్ హైకోర్టులో న్యాయవాదిగా పని చేస్తూ, బార్ అసోసియేషన్ ట్రెజరర్‌గా కూడా పనిచేశారు.

ఘనంగా మొహర్రం పండుగ

లింగంపేట/ నిజాంసాగర్/బాన్సువాడ రూరల్/ మాచారెడ్డి, జూలై 17: జిల్లా ప్రజలు మొహర్రం పండుగను బుధవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పీరీల ఊరేగింపు నిర్వహించారు. హిందూ, ముస్లిములు కలిసి సోదరభావంతో పండుగలో పాల్గొన్నారు. లింగంపేటలోని నాయకోనిగల్లీలో ఉన్న మసీదులో లాల్‌సాబ్, నాలే జార్, హుస్సేనీ ఆలం, కాసీందుల, హసీనిఆలం పీరీలను ప్రతిష్ఠించారు. భవానీపేటలో పీరీల సవారీని నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు, పెద్దలు దులా ఆడారు. మహ్మద్‌నగర్ మండలంలోని కొమలంచ గ్రామంలో పీరీల ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు నిండు బిందెలతో పీరీలకు నీళ్లు పోశారు. ఊదు, బెల్లం సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు.బాన్సువాడ మండలంలో మొహర్రం పండుగను ప్రజలు నిర్వహించారు. మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకొని సంగోజీపేట్, కోనాపూర్, హన్మాజీపేట్, దేశాయిపేట్, ఇబ్రహింపేట్ గ్రామాల్లో పీరీలను ఊరేగించారు. అనంతరం పీరీలను చెరువుల్లో నిమజ్జనం చేశారు. మాచారెడ్డి మండల కేంద్రంతోపాటు అక్కాపూర్, పాల్వంచ మండలంలోని ఫరీద్‌పేట, భవానీపేట గ్రామాల్లో మొహర్రం వేడుకలను నిర్వహించారు. కులమతాలకు అతీతంగా పీరీలను గ్రామాల్లో ఊరేగించారు.

బిచ్కుంద, సంగోజీపేట్‌లో పీరీలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

నేడు లింగంపేటకు సెంట్రల్ నోడల్ అధికారి రాక

లింగంపేట, జూలై 17: మండల కేంద్రం లింగంపేటకు సెంట్రల్ నోడల్ అధికారి బెంజ్‌మెన్ కరుణాకరణ్ గురువారం వస్తున్నట్లు ఎంపీడీవో నరేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని చారిత్రాత్మక కట్టడమైన నాగన్న బావిని ఆయన సందర్శిస్తారని పేర్కొన్నారు. లింగంపేటకు ఉదయం పది గంటలకు చేరుకుంటారని ఎంపీడీవో తెలిపారు.

డోంగ్లీలో నగర సంకీర్తన

డోంగ్లీ, జూలై 17: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా డోంగ్లీలో వార్కారీలు బుధవారం నగర సంకీర్తన చేపట్టారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం నుంచి నగర ప్రదక్షిణకు సంబంధించిన దిండి ప్రారంభించారు. గ్రామ దేవతల దర్శనం చేసుకొని విఠలేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆంజనేయ స్వామి ఆలయం వరకు భజనలు, ఆటాపాటలతో జ్ఞానోభా తుకారాం నామ స్మరణ చేస్తూ దిండిని తీసుకొచ్చారు. కార్యక్రమంలో వార్కారీలు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

నగర సంకీర్తనలో పాల్గొన్న వార్కారీలు

భక్తితో తొలి ఏకాదశి

ఎల్లారెడ్డి రూరల్/ పెద్దకొడప్‌గల్/ లింగంపేట/ నస్రుల్లాబాద్/ బీబీపేట/ బిచ్కుంద/ దోమకొండ, జూలై 17: తొలి ఏకాదశి పండుగను జిల్లావ్యాప్తంగా ప్రజలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పండుగ సందర్భంగా ఉపవాస దీక్షలను చేపట్టారు. ఉదయమే ఆలయాలకు వెళ్లి దేవుళ్లను దర్శించుకున్నారు. అన్ని ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొన్నది. ఎల్లారెడ్డిలోని బిందర్ మందిరంలో నిర్వహిస్తున్న రుక్మిణీ సమేత పాండురంగని ఆహ్నిక త్రయోత్సవాల్లో భాగంగా తొలి ఏకాదశి పురస్కరించుకొని పలు కార్యక్రమాలను చేపట్టినట్లు ఆలయ ధర్మకర్త వంగపల్లి నాగభూషణం తెలిపారు. వేదబ్రాహ్మణుడు జోషి ప్రణయ్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం ఐదు గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. కార్యక్రమాల్లో వంగపల్లి కాశీనాథ్‌తో పాటు మహిళా భక్తులు పాల్గొన్నారు. తొలి ఏకాదశి సందర్భంగా అయ్యప్ప ఆలయంలో కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ పూజారి శ్రీనివాసరావు తెలిపారు. పెద్దకొడప్‌గల్‌లోని పాపహరేశ్వర ఆలయంలో భక్తులు ఉదయం నుంచి వేద పండితులు శ్రీపత్‌రావు, వెంకటకృష్ణ ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. విష్ణు సహస్రనామాలు పఠించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లింగంపేటలోని నగరేశ్వర ఆలయం, శివాలయం, శెట్పల్లి గ్రామ శివాలయం, అయ్యపల్లి గ్రామ శివారులోని ప్రభుస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బీర్కూర్, భైరాపూర్ గ్రామాల్లోని విఠలేశ్వర ఆలయాలతోపాటు తిమ్మాపూర్‌లోని తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానం భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భజన కార్యక్రమాలు చేపట్టారు. బీబీపేటతోపాటు మాందాపూర్, జనగామ, తుజాల్‌పూర్, యాడారం, ఇస్సాపనగర్, ఉప్పర్‌పల్లి, మల్కాపూర్ తదితర గ్రామాల్లో భక్తులు ఏకాదశి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆలయాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. బిచ్కుందలోని విఠల రుక్మిణి ఆలయంలో అర్చకుడు దత్తు పంతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాన్ని దర్శించుకున్నారు. దోమకొండలోని శ్రీ చాముండేశ్వరీ ఆలయంలో అర్చకుడు బావి శరత్‌చంద్ర శర్మ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఎల్లారెడ్డి బిందర్ మందిరంలో హారతి ఇస్తున్న మహిళలు

బిచ్కుందలో పూజలు చేస్తున్న భక్తులు

సిలిండర్ పేలడంతో ఎగిరిపోయిన రేకులు

ప్రమాదవశాత్తు పేలిన గ్యాస్ సిలిండర్

■ తప్పిన ప్రమాదం ■ కాలిపోయిన రూ.లక్షా 500 నగదు
■ ఎగిరిపోయిన సిమెంట్ రేకులు

భిక్కనూరు, జూలై 17 : ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసమైన ఘటన భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెంది న సత్తెవ్వ తన ఇంట్లో ఉదయం గ్యాస్ వెలిగించగా ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దీంతో సత్తెవ్వ ఇంట్లో నుంచి బయటికి వచ్చేసింది.

ఈ లోపే పెద్ద శబ్దంతో గ్యాస్ సిలిండర్ పేలిపోయింది. సత్తెవ్వ ఉంటున్న ఇంటి పైకప్పు పేలుడు శబ్దానికి ఎగిరి చుట్టుపక్కల పడ్డాయి. ఈ ప్రమాదంలో సత్తెవ్వకు ప్రతి నెలా వచ్చిన పింఛన్ డబ్బులు రూ.లక్షా 500 నోట్లు, ఇంట్లో ఉన్న వస్తువులు పూర్తిగా కాలిపోయినట్లు స్థానికులు తెలిపారు.

21న ఎల్లమ్మకు బోనాలు

ఎల్లారెడ్డి, జూలై 17: ఎల్లారెడ్డి పట్టణంలోని గాంధీనగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో ఈనెల 21వ తేదీన రేణుకా ఎల్లమ్మ బోనాల పండుగను నిర్వహించనున్నట్లు ఆయా కాలనీవాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయానికి రంగులు వేసి అలంకరిస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణవాసులందరూ బోనాల పండుగలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, JAGIRAPU KISTAIAH (Old name) H.No .2-28/1,Ramannapet,Morthad,Nzb.Hence Changed my Name as JAGIRAPU KRISHNA REDDY S/O ELLAIAH (New name)
NTZ-340183

OLD AGE HOME

★ఒమేగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం॥ చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.
NT-325763-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
" పేరు మార్పిడి " ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

పాస్‌పోర్ట్ పోయినది

★ADVALA VAMSHI S/O ADVALA BAPU RAJANNA R/O. H.NO: 2-68, Vill: Ravutla, Mdl : Sirikonda, Dist: Nizamabad. నా యొక్క పాస్ పోర్ట్ నెం: U5388412 గలది రావుట్ల నుండి సిరికొండ బస్‌స్టేషన్‌కు బైక్‌పై వెళ్ళుతుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఎవరికైన దొరికినచో సంప్రదించగలరు. సెల్ : 97054 43195.
NTZ-340185

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మజ్జిగను పంపిణీ చేస్తున్న ముస్లిములు

ఎల్లారెడ్డిలో మజ్జిగ పంపిణీ

ఎల్లారెడ్డి, జూలై 17: మొహర్రం పండుగ సందర్భంగా ఎల్లారెడ్డిలోని సమీపంలో ముస్లిములు మజ్జిగ పంపిణీ చేశారు. పట్టణంలో పీరీల వేడుకలను చూసేందుకు వచ్చిన భక్తుల కోసం ఈ ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం

• విస్తరిస్తున్న విష జ్వరాలు
• ఆందోళన చెందుతున్న ప్రజలు

లింగంపేట, జూలై 17: గ్రామ పంచాయతీల పాలకవర్గం కాల పరిమితి ముగిసిన అనంతరం నియమించిన ప్రత్యేక అధికారుల పాలనలో పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామాలకు నియమించిన ప్రత్యేక అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గ్రామాల్లో మురికి కాలువలు శుభ్రం చేయక పోవడంతో ఈగలు, దోమలు వృద్ధిచెంది వ్యాధులు ప్రబలుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా మండల కేంద్రంలోనూ పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా నెలకొన్నది. మండల కేంద్రంలోని చీర పేండ్ల కుంటకు సాగునీటిని అందించే కాలువ పూర్తిగా ధ్వంసం కావడంతో అది డ్రైనేజీగా మారింది. కాలువ పరిసరాల్లో ఉండే నివాస గృహాల వారు ఇండ్లలో నుంచి వచ్చే నీటిని కాలువలోకి వదలడంతో మురికి కాలువగా మారింది. సహకార సంఘం షాపింగ్ కాంప్లెక్స్ పక్కన కాలువ నీటితో నిండి దుర్గంధం వెదజల్లుతున్నది. కాలువ కబ్జాకు గురికావడంతో నీరు నిండి దుర్గంధం వస్తున్నది. మురికి నీరు నిండడంతో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. మండలంలోని కోమట్‌పల్లి, పోతాయిపల్లి, పోల్కంపేట, మెంగారంతదితర గ్రామాల్లో పది మంది వరకు డెంగీ వ్యాధితో బాధ పడుతున్నట్లు మండల వైద్యాధికారిణి హిమబిందు తెలిపారు. ఇంటి పరిసరాల్లో మురికి నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బంది గ్రామస్తులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నా ఫలితం లేకుండా పోయింది. రెండు రోజుల క్రితం మండల కేంద్రంలో దోమలు వృద్ధి చెందకుండా మందును పిచికారీ చేయించినట్లు వైద్యురాలు తెలిపారు.

ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉన్నా.. గ్రామంలోని డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడంతో విష జ్వరాలు వ్యాపిస్తున్నాయి. గ్రామ పంచాయతీ పాలకవర్గ పదవీ కాలం ముగిసిన అనంతరం మండల స్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించారు. ఆయా శాఖల అధికారులు తమ విధుల్లో బిజీగా ఉండడంతో గ్రామాలను సందర్శించ లేకపోతున్నారు. దీనికి తోడు నిధుల లేమీ కూడా సమస్యగా మారింది. అధికారులు స్పందించి గ్రామాల్లో డ్రైనేజీలు శుభ్రం చేయించి, ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

లింగంపేటలోని సహకార సంఘం షాపింగ్ కాంప్లెక్స్ పక్కన ఉన్న నీటి పారుదల శాఖ కాలువలో నిలిచిన మురికి నీరు

క్యాన్సర్‌తో బాధపడుతూ ఉపాధ్యాయుడు మృతి

శక్తిరాజ్ (ఫైల్)

ఎల్లారెడ్డి రూరల్, జూలై 17: ఎల్లారెడ్డి లోని మోడల్‌స్కూల్‌లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న శక్తిరాజ్(40) బుధవారం ఉదయం మృతి చెందినట్లు ప్రిన్సిపాల్ సాయిబాబా తెలిపారు. హిందీ పండిట్‌గా పనిచేస్తున్న శక్తిరాజ్ రెండేండ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ.. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. వారం రోజుల క్రితం ఆరోగ్యం కొంత కుదుటపడినప్పటికీ అకస్మాత్తుగా మృతి చెందడంతో పాఠశాల ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు. తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలుపుగోలుగా ఉండే అతడు మృతి చెందడంతో స్వగ్రామం మద్నూర్‌తోపాటు ఎల్లారెడ్డిలో విషాదం నెలకొన్నది. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని ఉపాధ్యాయులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డి రూరల్, జూలై 17: మండలంలోని హాజీపూర్ తండా వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై మహేశ్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్మూర్ నుంచి జహీరాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తున్న ట్రాలీ ఆటో ఎల్లారెడ్డి మండలం హాజీపూర్ తండా వద్ద మూల మలుగుతుండగా ఎల్లారెడ్డి వైపునకు వస్తున్న బైక్ వేగంగా ఢీకొన్నది. దీంతో బైక్ నడుపుతున్న ఎల్లారెడ్డికి చెందిన ఎండీ ఎజాస్ తల, కుడి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రుడిని ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.